# పరివర్తన

రచన:
శ్రీ సి. యం. రామకృష్ణారెడ్డి

అర్ధరాత్రి ఆకాశంలో మినుకు మినుకు మంటున్న తారకలు ... ఎగుడు దిగుడుగా వున్న దుర్గమారణ్యంలో ఎక్కడో పారవేసినట్లున్న ఆ ప్రాంతం ... దగ్గు తెరలలా ముంచుకవస్తున్న చీకటి తెరలు - ఆ పరిసరంలో నక్షత్రాలు వొసగే గుడ్డి వెలుతురులో మసక మసకగా కన్పించే పూరి గుడిసె.

...నలిగిన మమతల నెమరువేసుకొంటూ, ఊహించ నలవికాని భయంతో, ఊపిరి సల్పుకోలేక, దగ్గు తెరలు క్రమ్ముకొస్తుంటే, ఆయాసంతో రొప్పుతూ, మసక చీకటిలో, ప్రమిద వెలుతురులో "జన్మూ" దిగులుగా కూర్చునివుంది. ఆమె దృష్టంతా తలుపువేపే- కొడుకు వస్తాడన్న ఆశతో ఆమె కన్నులు ఆశాపూరితాలవుతున్నాయ్. మొన్ననగా వెళ్ళాడు. ఈవేళ తప్పక రావచ్చు. తప్పక వస్తాడు. ఇక ఆలోచించలేక బొప్పికట్టిన ఆమె మనసు పదేపదే అటువైపు లాగుతుంది. అప్పుడు...!

× × ×

మనము అంగీకరించిన పంచశీలను కాదని చైనావాడు సరిహద్దున దురాక్రమణ కావించాడనేసరికి జన్మూ ఒక్కసారిగా కోపంతో వీగిపోయింది. మన దేశం నలుమూలలనుంచి సరిహద్దు రక్షణకు జవానులు వస్తున్నారనేసరికి ఆమె ఆనందానికి అవధుల్లేకపోయాయి. గొఱ్ఱెలు తోలుకవచ్చిన జయతుంగ్ తల్లి చెప్తున్న చైనా దురాక్రమణనుగూర్చి వింటూంటే కోపంతో వీగిపోయాడు. శత్రువును సైతం పొలంగట్టు ప్రక్కనేయని మనం, కేవలం చైనా యావత్ దేశాన్ని ఆక్రమించాలనుకోవడం సహించరాని విషయం అన్నాడు. అంతే! ఆ రోజే చేత ఒక ఆయుధాన్ని ధరించి గొఱ్ఱెలు తోలుకొని ఎటో దూరంగా వెళ్ళిపోయాడు...!

'జయతుంగ్' వెళ్ళి అప్పటికే రెండు రోజులు కావస్తుంది. క్షణమొకయుగంగా గడిచే ఆప్రాంతంలో, ఎప్పుడు ఏసమయంలో శత్రువులు ముంచుకవస్తారో, ఏ గుడిసెను దగ్ధంచేస్తారో, ఏ మానవున్ని చిత్రహింస చేస్తారో, ఈ రాక్షస కృత్యాలను ఎలా అరికట్టాలో అన్న ఊహారచనను పన్నడంలో మునిగిపోయిన ఆ లోయ ప్రజలకు జయతుంగ్ ఎంతకూ రాకపోయేసరికి ధైర్యం సన్నగిలిపోసాగింది...కంటికి వొత్తులు వేసుకు ఎదురు చూస్తున్న జన్మూ తలుపులు కిర్రుమన్న చప్పుడయ్యేసరికి, కొడుకు వచ్చాడన్న సంతోషంతో, ఆనందంతో పొంగిపోయింది. మెల్లగా లేచి పొన్నుకఱ్ఱను సరిచేసుకొని దీపం చేత పట్టుకొని తలుపు దగ్గరగా వెళ్ళింది. ధమేల్ మన్న శబ్దంతో తలుపులు బార్లా తెరచుకొని లోనికి ప్రవేశించిన నూతన వ్యక్తిని చూచి జన్మూ నివ్వెర

పోయింది. తన కొడుకు కాదే! మరెవ్వరో వ్యక్తి! ఒక్కపల్చగావున్న ఆ పల్చటి శరీరంపై జాలువారే ఆరక్తధారల కన్నిటి కథ లేమిటి! ఆయాసంతో రొప్పుతూ వచ్చిన ఆ వ్యక్తి, జన్మ్మాను చూసి అలాగే నిలబడి కొద్దిసేపటిదాకా మాట్లాడలేకపోయాడు. ఒక్కసారి బరువుగా ఊపిరి పీల్చుకొని శరీరం నిండావున్న గాయాలను ఒక చేతితో తుడుచుకొంటూ, మరొక చేతిని నోటికి దగ్గరగా పెట్టుకొని దాహం వేస్తున్నట్లుగా సంజ్ఞ ద్వారా తెలియచేశాడు. జన్మ్మా అతని ముఖంకేసి పరిశీలనగా చూసింది. అతని వేషధారణ, ముఖం తీరు చైనీయునిలా కొట్టుకవచ్చినట్లున్నాయి. జన్మ్మా ఒక్కసారి కోపంతో వూగిపోయింది. యావత్ దేశాన్ని దురాక్రమణ ద్వారా అక్రమించాలని చూస్తున్న ఈ భ్రష్టునికా తాను దాహం తీర్చవలసింది. రెట్టించిన కోపంతో 'జన్మ్మా' ''ఎవరు నీవు'' అంటూ చైనీయున్ని ప్రశ్నించింది. చైనీయుడు కొద్దిసేపు ఆలోచించి అన్నాడు - ''నేనెవరైనా కావచ్చు, కానీ ఇప్పుడు దారి తప్పిన బాటసారిని మాత్రమే. హిందూదేశంలో దయామయు లనేకులు వున్నారని విన్నాను. గాయాలతో బాధపడుతున్నాను. దాహం తీర్చితే ఈ రాత్రికి సేద తీర్చుక వెళ్ళతాను. అమ్మా! ఈ ఒక్క రాత్రికి చోటిస్తే ఎప్పటికీ నీకు ఋణపడి వుంటాను''. ప్రాంతీయ భాషలో మాట్లాడుతున్న ఆ చైనీయున్ని చూసేసరికి జన్మ్మా హృదయం ఒక్కసారి కరుణతో నిండిపోయింది. ఆశ్రయము కోరినవారికి చూపెట్టవలసినదే మానవకర్తవ్యము. ఇతనూ ఇంచుమించు జయతుంగ్ వయసువాడే అయివుండవచ్చు. పాపం! తన కొడుకు ఈసమయంలో, ఈ చీకట్లో, ఈ అర్ధరాత్రి, ఏ లోయలో, ఏ చెట్టుక్రింద పడిగాపులు కాస్తుంటాడో! లేక తనలాంటి దయామయి ఆశ్రయంలో సురక్షితంగా వున్నాడో! ఆశ్రయించినవారిని తోలగద్రోయడం భావ్యంకాదు. జన్మ్మా ఇక ఆలోచించలేకపోయింది. ఓ మూలనున్న బొంత తీసుకవచ్చి, నులక మంచముపై సర్ది చైనా సిపాయిని పరుండబెట్టింది. సిపాయికున్న గాయాలను తడి బట్టతో తుడిచి మందు పూసి అతని దాహం తీర్చింది. కొడుకుకోసం ప్రొద్దుననగా చేసిపెట్టిన రొట్టెను ఇచ్చి సిపాయిని సంతుష్టిని చేసింది. ''సిపాయీ! నీ పేరేమి'' అన్న ప్రశ్నకు 'ఛింగ్ ఫో' అంటూ సమాధానమిచ్చాడు సైనికుడు.

కొద్దిసేపు మౌనం వారిద్దరిమధ్యా రాజ్యం చేసింది. చీకటి తెరలు మెల్లగా అటూ ఇటూ కదిలాడాయి. సిపాయి మెల్లగా అన్నాడు-'అమ్మా! మీ ఇంట్లో ఎవరూ లేనట్లున్నారే' అని.

జన్మ్మా ముఖంలో విచార రేఖలు క్రమ్ముకొన్నాయి. కష్టాలతో నడుస్తున్న తన జీవితం, జయతుంగ్ వెళ్ళినతర్వాత తను పడ్డ బాధ అన్ని జ్ఞప్తికివచ్చాయి. సిపాయితో ఇలా అంది - ''కాదు నాయనా! నాకొక కుమారుడున్నాడు. వాడి పేరు జయతుంగ్. గొఱ్ఱెలు కాస్తాడనేకానీ వాని భావాలు, వాని

చేష్టలు ఎప్పుడూ వున్నతంగానే వుంటాయి. భారతదేశమంటే వాడికి అపార గౌరవం. నా ప్రాణముండగా ఒక్క శత్రువునికూడా మాతృదేశంలోనికి రానీయను అనే వాడెప్పుడూ. తెల్లని కోటు, కోటుమీదున్న 'ఎర్రని గులాబీ' వాని వునికిని తెలియచేస్తాయి. గులాబీలంటే వాడికి అపరిమితమైన ప్రేమ. పిచ్చి వ్యామోహం. నిజంగా వాడు బంగారంలాంటివాడు. మొన్న చైనీయుడు దురాక్రమణ చేస్తున్నారనేసరికి కోపంతో వీగిపోయాడు. అంతే! గొఱ్ఱెలు తోలుకొని చేత నొక తుపాకీ ధరించి ఆ పర్వతాలవేపు వెళ్ళాడు వాడు. జన్మా ఉద్వేగంతో చెప్పకపోతుంది, సిపాయి ఇక వినలేకపోయాడు. మందు పూసిన గాయాలు నొప్పి చేస్తున్నాయి. గట్టిగా కళ్ళు మూసుకొని నిదానంగా జన్మాతో అన్నాడు-''అమ్మా! చాలు. గాయాలు నొప్పిచేస్తున్నాయ్. కొంచెంసేపు నిదురపోతాను'' అన్నాడు. జన్మా తల వూపి చైనా సిపాయికి దుప్పటి ఇచ్చి తను వెళ్ళి దీపం దగ్గరగా వుంచుకొని తలుపు దగ్గరగా కూర్చుంది కొడుకు వస్తాడన్న ఆశతో—

సిపాయి పండుకొన్నాడేకానీ ఆతనికి నిద్ర రాలేదు. నిన్ననగా మిలిటరీ క్యాంపును విడిచి రావటం, శ్రమతో గొఱ్ఱెలు తోలుకొని వస్తున్న భారతీయునితో ఘర్షణపడటం, ఇద్దరికీ తీవ్ర పోరాటం జరగడం, తను మోసంతో అతన్ని చంపి గాయాలతో బయటపడటం, చీకటిపడ్డాక త్రోవ తప్పి జన్మా దగ్గర ఆశ్రయం సంపాదించటం, అన్నీ ఒక్కొక్కటే సినిమా రీళ్ళలా తనముందు కదిలాడాయి. జస్మా తన కొడుకుకథ చెప్తున్నంతసేపు తను కలవరపడ్డాడు, బాధపడ్డాడు. భగవాన్! తనకేనా ఇలాంటి శిక్ష! సిపాయి ఇక ఆలోచించలేక గట్టిగా కళ్ళు మూసుకొన్నాడు. నిద్ర కుపక్రమించాడు. గులాబీలంటే వాడికి అపరిమితమైన ప్రేమ అన్న వాక్యాలు అతనిచుట్టు తిరుగుతున్నాయి.




Manufacturing ¾ H.P. 20 H.P.—3 Phase RPM Motors 960, 1450 & 2890 Monoblock set 2 H.P. to 20 H.P. 3 Phase ¾ HP. to 2 HP.

*Dealers in Madras City:*—UNITED AGENCIES
96, Arminian Street, Madras-1.
POPULAR ELECTRICALS,
329, Thambu Chetty St, Madras-1.

Sole Agents for Eastwhile Hyderabad & Maharashtra State, M/s. Vijai Agencies 24, Market Road, Secundarabad-3.

*Agents for Cuddappah Dt:*—
M/S. V. S REDDY & CO.,
4/192, Dr. Ayyaswami Pillai St.,
Cuddapah (A.P.)

భళ్ళున తెల్లవారింది. మంచు తెరలను చీల్చుకొంటూ సూర్యకిరణాలు భూమిమీద పడి ప్రకాశిస్తున్నాయి. మబ్బులు పర్వతాల నట్టే అంటిపెట్టుకొన్నాయి. ధరిత్రికి ఒక శుభోదయమా అనిపిస్తుంది ఆవేళ...సిపాయి లేచి, కాలకృత్యాలు తీర్చుకొని వెళ్ళుతూ, జన్మా దగ్గరకు వచ్చాడు ఆశీర్వాదం కోసం. జన్మా ఆశీర్వదించగా సిపాయి ఇలా అన్నాడు-''అమ్మా! భారతదేశంలో మీ లాంటి కరుణామయులకు నేనెంతో ఋణపడి వున్నాను. నాకు మరో జన్మంటూ వుంటే భారత దేశంలో జన్మించాలని గాఢంగా వాంఛిస్తాను'' సిపాయి ఇక మాట్లాడలేక పోయాడు అతని కళ్ళు దేనికోసమో వెదుకు తున్నాయి. ఎక్కడో దూరంగావున్న బౌద్ధా రామంలోని ఘంటారవం అతని చెవులకు లీలగా విన్పిస్తుంది. అతని హృదయం తేలిక పడ్డటయింది. తుపాకీ నక్కడే వదిలేసి వడి వడిగా నడుస్తూ, అ లోయలోని రాళ్ళలో త్రోవ చేసుకొంటూ ఎక్కడికో వెళ్ళి పోయాడు...

జన్మా తన కొడుకు వస్తాడని లోయకేసి చూస్తూ వుండిపోయింది కొడుకు వస్తాడన్న ఆశతో-ఆమెకేమి తెలుసు, జరిగిన నిజం....?


## కథాంజలి
(మాస పత్రిక)

విడి ప్రతి. ... 25 పై. లు
సంవత్సర చందా. ... రూ. 4-00
(ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గిన్ బాతమ్స్, మరియు స్వదేశ మిత్ర బుక్ స్టాల్సులలోను దొరుకును.


## అంజలి

కథాంజలి నీకిదె మా అంజలి.
జన్మదినంలో చక్కనైన
కథలెన్నో చవిచూపుచు
మాకిచ్చావు. కథాంజలి
నీకిదె మా అంజలి!

× ×

చిరకాలం వర్ధిల్లుము
స్వేచ్ఛగాను విహరించుము
మాకు మంచి సాహిత్యం
ప్రతి మాసము కొనివత్తువు,
శాశ్వితముగ మాకివ్వుము.
నీ సంస్కృతి నీ సంపద
నీ అదిపతి కీర్తి జగత్తున
సూర్య చంద్రులవోలె నిలవాలి!

× ×

అర్ధికముగ నీవెప్పుడు
ఆనందముగా నుండెదవని
మేమెప్పుడు ఆశింతుము,
దీవింతుము. ఓ కథాంజలి
నీకిదె మా అంజలి!

× ×

తెలుగుదనపు తీయదనం
నీయందే కనిపించును,
నీవెప్పుడు మామదిలో
నిలకడగా నిశ్చయముగా
నెలకొందువు. ఓ కథాంజలి
నీకిదె మా అంజలి.

—ఎం. పి. కుమారస్వామి
బి, కాం.,